# బైక్ దొంగ వడ్డే రాజు అరెస్ట్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
మోటార్‌సైకిల్‌ను అపహరించుకుపోయిన దొంగను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మేడపాటినగర్‌కు చెందిన లాబ్ టెక్నిషియన్ సప్పిడి యశ్వంత్‌రెడ్డికి చెందిన బైక్ (టిఎస్30జి-6884)ను ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు క్రైమ్ నెం:109/2025 కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం 1గంట సమయంలో బైక్‌పై వెళ్తున్న వడ్డే రాజు (33)ను అదుపులోకి తీసుకొని విచారించగా బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు నిర్ధారణ అయింది. మహబూబ్‌నగర్ జిల్లా పాతపాలెం మండలం నీలహల్లి చాకలివీధికి చెందిన కూలీపనిచేసే వడ్డే రాజు మేడపాటినగర్‌లో బైక్‌ను చోరీచేసినట్లు అంగీకరించడంతో అతని అరెస్ట్‌చేసి బైక్‌నుస్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# అన్నదానం మహాదానం

**-జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**

**కీసర, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
అన్నదానం మహాదానం అని జిల్లా అదనపపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కీసరగుట్టలో శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు గత కొన్నిసంవత్సరాలుగా అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే ఆరురోజులు ఎంతమంది భక్తులు వచ్చినా సరే అన్నదానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా, కోశాధికారి బచ్చు నాగేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు లేకుండా వెంటనే పరిష్కరించుకోవాలి

**-జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి**



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎలాంటి పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. మొదటగా జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసుల వివరాలు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఎలాంటి ఫైల్స్ పెండింగ్‌లో ఉంచవద్దు, ఎప్పటికప్పుడే అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ నమోదులో ఫైల్స్ పెండింగ్‌లో పెట్టవద్దని తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి ఫంక్షనల్ వర్టికల్‌పైన ప్రత్యేక దృష్టి కేటాయించాలని, యూఐ కేసులు, పాత పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ ఆక్ట్ కేసుల పైన ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్‌తో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో ఉండి కేసులలో కన్విక్షన్ శాతాన్ని పెంచాలని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రతి శనివారం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకొని అందరూ పోలీస్ సిబ్బందితో పోలీస్ అధికారులు మాట్లాడాలని పేర్కొన్నారు. పోలీస్ అధికారులందరు రోడ్డు ఆక్సిడెంట్‌లు, ఆత్మహత్యలు జరుగుటకు కారణాలు తెలుసుకొని వాటిని తగ్గించేందుకు కృషిచేయాలని అన్నారు. ప్రజలలో సిసిటివిలపైన అవగాహన కల్పించాలని, పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై పని చేయాలని తెలిపారు. డైల్ 100 కాల్స్ పైన నిర్లక్ష్యం చేయవద్దని, చోరీ కేసులపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. దొంగతనాలపైన ప్రజలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి టివి హనుమంత్‌రావు, తాండూర్, పరిగి, వికారాబాద్, డిసిఆర్‌బి డిఎస్‌పి, ఏఆర్ డిఎస్‌పి, జిల్లా ఇన్స్పెక్టర్‌లు, సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళు, భవనాలు, ఇతర నిర్మాణాలకు భద్రత

**-పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మున్సిపల్ ఎంపిక**




మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**కొడంగల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 152 మున్సిపాలిటీల్లో పైలెట్ ప్రాజెక్టుగా నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్‌బేస్డ్ ల్యాండ్‌సర్వే అఫ్ అర్బన్‌హ్యాబిటేషన్స్(నక్ష) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులోభాగంగా తెలంగాణారాష్ట్రంలో 10మున్సిపాలిటీలను ఎంపికచేసింది. అందులో వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపాలిటీ ఉంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కాబట్టి తొలిదశలో కొడంగల్‌ను ఎంపిక చేశారు.ఇందులో భాగంగా మంగళవారం కొడంగల్‌లో నక్ష పైలెట్ ప్రాజెక్టు సర్వేను ప్రారంభించారు. వికారాబాద్‌జిల్లా స్థానికసంస్థల అడిషనల్‌కలెక్టర్ సుధీర్, వికారాబాద్‌జిల్లా సర్వేఅండ్‌ల్యాండ్ రికార్డ్సు అసిస్టెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, డిపార్ట్‌మెంట్ అఫ్ ల్యాండ్ రీసోర్సెస్ సభ్యులు సుధీర్ గొలి, సర్వే అఫ్ ఇండియా అఫీసర్ సమీరొద్దిన్, డిప్యూటీ డైరెక్టర్ సర్వేఅండ్‌ల్యాండ్‌రికార్డ్స్ ఉమామహేశ్వర్‌రావు,కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి,తహసీల్దార్ విజయ్‌కుమార్,మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్,జిల్లా గ్రంథాలయ సంస్ద చైర్మన్ రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొని, సర్వేను అధికారికంగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ళు,భవనాలు ఇతరనిర్మాణాల పూర్తివివరాలను జియో స్పేషియల్ సాంకేతికతతో సేకరిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్‌పరిధిలోని ప్రతిస్థలంలోని అణువణువు డిజిటల్‌రూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఇండ్లు భవనాల విస్తీర్ణం,ఎత్తు,సర్వే నంబర్,యజమాని పేరు,ఇతర సమగ్ర వివరాలతో ప్రాపర్టీకార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. పక్కాగా రెవెన్యూరికార్డులు, ఆస్తిపన్ను నిర్ణయం, వసూళ్ళలో పారదర్శకత ఉంటుందన్నారు. ఇళ్ళస్థలాల వివరాలకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు.భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికలకు ఈసర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. ఏరియల్‌సర్వే సిబ్బంది మాట్లాడుతూ మూడుపద్ధతుల్లో ఏరియల్‌సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.డ్రోన్లు,హెలిక్యాప్టర్లు,చిన్నపాటి విమానాలకు ప్రత్యేకంగా కెమెరాలను బిగించి సర్వే చేయడానికి అనుమతి ఉందన్నారు.కొడంగల్‌లో హెలికక్యాప్టర్ ద్వారా సర్వే చేయనున్నట్లు తెలిపారు. గాలిలో ఎగురుతూ హెలిక్యాప్టర్ ద్వారా ఫోటోలు తీస్తామన్నారు. ప్రతి ఫోటోకు ఐడెంటిటి నంబర్ ఉంటుందన్నారు. ఈసర్వేలో భూమిపైన ఉన్న నిర్మాణాలకు సంబధించిన వివరాలు అన్‌లైన్‌ద్వారా అందుతాయని తెలిపారు.సర్వేనంబర్,ఇంటినంబర్, విస్తీర్ణం,యజమాని పేరు తదితరవివరాలతో ఫోటోలువస్తాయని అన్నారు.ఈసమాచారంతీసుకొని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంబంధిత స్థలాల దగ్గరకు వెళ్ళి విచారణ చేస్తారని తెలిపారు. అనంతరం యజమానికి ప్రాపర్టీ కార్డు వస్తుందన్నారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు ఇళ్ళ స్థలాల వివాదాలకుచెక్ పెట్టేందుకు కేంద్రప్రభుత్వం ఈసర్వేకు ఆదేశించిందని తెలిపారు. అనంతరం సర్వే సిబ్బంది మున్సిపల్ పరిధిలో సర్వే చేయడానికి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి వెళ్ళారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు,పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

**-టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను సన్మానించిన ఉద్దెమర్రి నాయకులు**



టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గజమాలతో సన్మానించిన నాయకులు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
ఉద్దెమర్రి శ్రీవిష్ణు,శివాలయ అభివృద్ధికి నిధులు 50లక్షల రూపాయలు మంజూరు చేయించి టెండర్ల జారీకి కృషిచేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గజమాలతో ఉద్దెమర్రి నాయకులు సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి గ్రామనాయకులు, ఆలయ కమిటీవారు ఆయన నివాసానికివెళ్ళి ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనతోపాటు గ్రామ నాయకులు మాజీసర్పంచు పి.బాలనర్సింహ్మా, నాయకులు ఎన్.విష్ణుగౌడ్, వెంకటగిరిప్రసాద్, నల్ల ప్రభాకర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, లక్ష్మణ్, గోపిరెడ్డి, నర్సింలు, భవానందం, సాయికుమార్, బ్రహ్మం, శ్రీనాథ్, ఆలయకమిటీ సభ్యులు రవీందర్‌గౌడ్, సామల రాజిరెడ్డి, పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేయడంలో రేవంత్‌రెడ్డి దిట్ట

**-కల్వకుర్తి నుండే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభం**
**-ఢిల్లీకి తప్ప గల్లీకి రేవంత్ చేసిందేమీలేదు**
**-రేవంత్‌రెడ్డి సర్కారుపై కెటిఆర్ ఘాటు విమర్శలు**



ఆమనగల్లులో జరిగిన రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న కెటిఆర్

**ఆమనగల్లు, ఫిబ్రవరి18, ప్రభాతవార్త:**
అధికారదాహంతో అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్‌ప్రభుత్వం ఏడాదిన్నర కాలంగా మోసంచేస్తూ ప్రజలను వంచిస్తుందని భారాస కార్యనిర్వహణ అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ ఆరోపించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థపాలనలో ఆత్మహత్యలు తప్ప అభివృద్ధికి నోచుకోవడంలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వ వైఖరితో రైతులు, విద్యార్థులు, ఆటోరిక్షాకార్మికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసం చేయడంలో రేవంత్‌రెడ్డిని మించిన వారు తెలంగాణలో లేరని కెటిఆర్ విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మిషన్‌భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌ల అధ్యక్షతన జరిగిన రైతు నిరసనదీక్షలో కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరై రేవంత్‌రెడ్డి సర్కారుపై ఘాటుగా విమర్శలుచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో లబ్ది పొందేందుకే రేవంత్‌రెడ్డి సర్కారు మరోసారి మోసంచేస్తుందని, రైతు రుణ మాఫీ, పంట పెట్టుబడి డబ్బులను అరకొరగా వేస్తున్నారు తప్ప రైతు ప్రయోజనం కోసం కాదని కెటిఆర్ అన్నారు. వానాకాలం పంటకు ఇచ్చే రైతుభరోసా యాసంగిపంటకు కూడా అందించలేకపోతుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల కోసం మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలవద్దకు వస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని ప్రజలు గట్టిగా అధికార పార్టీ నాయకులను నిలదీయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి తగినబుద్ధి చెప్పాలంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆపార్టీని ఓడించాలన్నారు. కెసిఆర్ పదేళ్ళపాలనలో తెలంగాణరాష్ట్రంలో వ్యవసాయరంగం స్వర్ణయుగంగా ఉండేదని, రైతును రాజుగా చేసేందుకు కెసిఆర్ సర్కారు 73వేలకోట్లరూపాయలు రైతుల ఖాతాలో జమచేసిందని, రైతుబీమా, రైతుబంధు, ఉచిత విద్యుత్‌వంటి అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అమలుచేసిన ఘనత భారాస ప్రభుత్వానికి దక్కిందన్నారు. కెసిఆర్‌కు మళ్ళీ అధికారాన్ని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలను మోసంచేస్తున్న రేవంత్‌రెడ్డి పుట్టిన గడ్డ కల్వకుర్తి నుండే పతనం ప్రారంభమవుతుందని కెటిఆర్ ధీమా వ్యక్తంచేశారు. ఏడాదిన్నర కాలంలో రేవంత్‌రెడ్డి సర్కారు 10శాతం మంది రైతులకు కూడా రైతుబంధు డబ్బులు సక్రమంగా వేయడం లో విఫలం చెందారన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.17,500 రైతుకు బాకీ పడ్డారని అన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యుల స్వప్రయోజనాల కోసమే ఫోర్తుసిటీపేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపి రైతులనుండి బలవంతంగా భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. గత సర్పంచుల బిల్లులు మంజూరు చేయకుండా రేవంత్‌రెడ్డిసర్కారు కక్ష్యసాధింపు చర్యలకు దిగుతుందని, దీంతో ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతుదీక్షలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సురభీ వాణిదేవి, నవీన్ కుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజు, మర్రిజనార్ధన్‌రెడ్డి, రాజయ్య, అంజయ్య యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, రాష్ట్రసర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, అనురాధపత్య నాయక్, నిర్మలశ్రీశైలంగౌడ్, జర్పుల దశరథ్ నాయక్, సింగిల్‌విండోచైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, ఎడ్మసత్యం, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్ రావు, సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**



వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జిల్లాస్థాయి అధికారులు



సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వివిధశాఖల అధికారులు

**వికారాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
రానున్నవేసవిలో నీటిఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతుభరోసా, రబీ సీజన్‌కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ, వచ్చే వేసవిలో రానున్న మూడు నెలల్లో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణరంగానికి విద్యుత్‌సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలుచేపట్టాలని అన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత జిల్లాకలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌నుండి జిల్లా అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు) సుధీర్, తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్‌వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈవీడియో కాన్ఫరెన్సులో ట్రైనీకలెక్టర్ ఉమా హారతి, డిఆర్‌డిఏ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి. సివిల్ సప్లయ్ మోహన్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ లీలావతి, మిషన్‌బగీరథ అధి కారి చాల్మారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
వేసవిలో నీటిఎద్దడి సమస్య తలెత్త కుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఎంసిహెచ్‌ఆర్‌డి నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్, పంచాయతీ అధికారి, జిల్లా విద్యుత్‌శాఖ అధికారి, వ్యవసాయశాఖ అధికారి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

**-సమవేశంలో జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి**




కీసరగుట్టలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**కీసర, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
తెలంగాణాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని మేడ్చల్‌జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆలయకళ్యాణమండపంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ఆలయకమిటీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసేభక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైనచర్యలు తీసుకోవాలన్నారు. మహాశివరాత్రితో పాటు అంతకు ముందు రోజుల్లో సైతం భక్తులు ఎక్కువగానే వస్తారని దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయసిబ్బంది సైతం ఎక్కువమందికి స్వామివారి దర్శనం కలిగేలా చూడాల్సిందిగా సూచించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్లను పెంచాలన్నారు. వివిధప్రాంతాల భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేయాలని అదేవిధంగా వృద్ధులకు, దివ్యాంగుల కోసం ఆటోలను అందుబాటులో ఉంచాలన్నారు. భద్రతాలోపం తలెత్తకుండా పోలీస్‌శాఖ పటిష్టబందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసరచికిత్సకై అవసరమైన వైద్యసిబ్బంది మందులు అందుబాటులో ఉంచాలన్నారు. బ్యారికేడ్, దర్శనం, క్యూలైన్, పార్కింగ్ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్ వారికి తెలిపారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈవిషయంలో మున్సిపాలిటీ అధికారులు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లుచేయాల్సిందిగా తెలిపారు. బ్రహ్మోత్సవాల జాతరలో పూజాసామగ్రి, ఆహార పదార్థాలనుంచి మొదలుకుని అన్నిరకాల వస్తువుల విక్రయానికి సంబంధించినధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైనచర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులు, వ్యాపారులకు తెలపాలన్నారు. జాతరలో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితోపాటు ఫైరింజన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే గుట్ట కింద ఉన్న నూరమ్మ చెరువు దగ్గర గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా కీసరగుట్ట ఆలయానికి సంబంధించి ఏమైనా సమస్యలు ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈఓ, చైర్మన్‌లకు తెలిపారు. అత్యవసర విభాగాలైన పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, ఫైర్, మెడికల్, శానిటేషన్ విభాగాలలో మూడుషిఫ్టులలో విధులు నిర్వహించేలా సిబ్బందిని ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ఆలయ కమిటీసభ్యులు కలిసి విజయవంతం చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. భక్తులకు ప్రత్యేకదర్శనం కల్పించేందుకు ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను అదనపు కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో ఆర్‌డిఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె రమేష్‌గుప్తా, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా, పోలీస్, విద్యా, వైద్య, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ట్రాఫిక్, సమాచార, మత్స్య, ఫైర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోల్డ్ స్కీమ్ పేరుతో జనాలకు టోకరా

**-మాయ మాటలు చెప్పి మోసం చేసిన నేరస్థుని అరెస్టు**

**షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
షాద్ నగర్ పట్టణంలోని అంకిత్ జువెల్లరి షాప్ యాజమాని అయిన అవుసుల నరేశ్ అనే వ్యక్తి లక్ష్మీనరసింహ గోల్డ్‌సేవింగ్ స్కీమ్, చిట్టీలవ్యాపారముతో జనాలకు మాయమాటలు చెప్పి టోకరావేసినకేసులో పోలీసులు ఆవ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు మంగళవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ విజయ్‌కుమార్ మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం... షాద్‌నగర్ పట్టణానికి చెందిన అంకిత్ జువెల్లరి యజమాని బంగారంషాప్‌ను చూపించి గోల్డ్‌స్కీమ్, చిట్టీల వ్యాపారముతో కొంతమందివద్ద దాదాపు ఒకకోటిరూపాయలు మోసంచేసినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఈమేరకు కేసు నమోదుచేసి టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితుడిని అరెస్టుచేసి నిందితుని వద్ద నుండి సంబంధిత గోల్డ్‌స్కీమ్ బుక్స్, సెల్‌ఫోన్‌ను స్వాధీనంచేసుకొని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మీడియాకు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో షాద్‌నగర్ ఎసిపి రంగస్వామి పర్యవేక్షణలో ఛేదించడం జరిగిందని. ఈకేసులో ముఖ్యపాత్ర పోషించిన పోలీసు అధికారులకు తగిన రివార్డులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ

# చల్లంగా చూడు అమ్మోరు తల్లీ..

**-ఖానాపూర్‌లో కన్నుల పండువగా ఊరడమ్మ జాతర**

**పెద్దేముల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**
సల్లంగాచూడు అమ్మోరుతల్లీ అంటూ గ్రామదేవతను గ్రామస్థులు వేడుకున్నారు. మంగళవారం పెద్దేముల్‌మండలంలోని ఖానాపూర్‌లో ఊరడమ్మజాతరను కన్నులపండువగా నిర్వహించారు. గ్రామదేవతజాతరను పురస్కరించుకొని అమ్మవారి ఆలయానికి రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబుచేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. పిల్లాపాపలు సంతోషంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. డప్పు,డోలువాయిద్యాల చప్పుళ్ళకు శివ భక్తులు పూనకాలతో ఊగిపోయారు. పోతురాజుచేసిన విన్యాసాలు, ఏరుపులసాణి వినిపించిన భవిష్యవాణి అందరిని ఆకట్టుకున్నాయి, గ్రామదేవత జాతర సందర్భంగా ఖానాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



కళ్యాణ లక్ష్మి ్మ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి హిమాయత్ నగర్ తహసిల్దార్ కార్యాలయంలో గాంధీనగర్, కవాడీగూడ, రామ్‌నగర్ డివిజన్లకు చెందిన 31 మంది లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక తహసిల్దార్ డీ సంధ్యారాణి తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, డిప్యూటీ తహసీల్దార్ రఘు విష్ణు కుమార్, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకర ముదిరాజ్, మీడియా ఇన్చార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, నేతలు కళ్యాణ్ నాయక్, పి సుధాకర్, కవాడిగూడ డివిజన్ కార్యదర్శి సాయి కృష్ణ, రాజశేఖర్ గౌడ్, ఎస్టీ ప్రేమ్, దేవేందర్ నాయక్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

**జానపద కళాకారులకు శివరాత్రి ప్రదర్శనలు ఇప్పించాలి**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** జానపద కళాకారులకు వృత్తి పోయి ఉపాధి కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా జానపద కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డిమాండ్ చేస్తూ గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బుధవారం 18 బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జానపద వృత్తి పరిరక్షణ జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్పాండే మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం డిపిఆర్ఓ కింద కళాకారులకు జీవనభృతి కల్పించారు. తెలంగాణ వచ్చినప్పుడి నుండి జీవనభృతి లేదు, కళాకారులకు గుర్తింపు కార్డు లేవు, పించన్లు, ఇండ్లు లేవు రవింద్రభారతి అగ్రహారంగా మారిందన్నారు. తక్షణమే తెలంగాణ జానపద అకాడమీ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో యక్షగాన జానపద కళాకారుల పై సమగ్ర సర్వే చేయాలని రవింద్రభారతి జానపద కళాకారులకు ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు 500 కోట్లు కేటాయించాలని అకాడమీ ఛైర్మన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసి దగాపడ్డ కళాకారులంతా రోడ్డెక్కాల్సిందే ఆందోళనకు సిద్ధం గావలంటూ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు చైర్మన్ వి.రామకృష్ణ రెడ్డి జానపద మీడియా ఇంచార్జీ సిహెచ్ సుధాకర్ బ్రాహ్మణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన రాష్ట్ర నేత నరేందర్



మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి బొకె అందచేస్తున్న కొమ్ముల నరేందర్

**బేగంబజార్, ఫిబ్రవరి 18ప్రభాతవార్త:** దశాబ్దాల వివక్షను నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి దేశానికి స్ఫూర్తినిచ్చేలా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను బిఆర్ఎస్‌రాష్ట్ర నాయకులు, బాబు జగ్జీవన్‌రాం ఎడ్యుకేషనల్ సొసైటి చైర్మన్ కొమ్ముల నరేందర్ మర్యాద పూర్వంగా కలిశారు. ఈసందర్భంగా కెసిఆర్‌కు మెమెంటోను అందచేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మహకుంభ మేళాలో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్



కుంభమేళాలల్లో సూర్య నమస్కారం చేస్తున్న బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 18ప్రభాతవార్త:** ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంబ్ మేళాలో జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్‌రాకేష్ జైస్వాల్ మంగళవారం స్నానం చేసి సూర్య నమస్కారం చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ...ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అధిత్యనాథ్ కుంబ్ మేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండాఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అక్కడ అన్నివిభాగాలతో అధికారులతోపాటు పోలీసులు చేస్తున్నసేవలు బేష్‌గా ఉన్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడేది సాంస్కృతిక సంస్థలే



సభలో ప్రసంగిస్తున్న దైవజ్ఞశర్మ, చంద్రశేఖర్, రామాచారి, విజయలక్ష్మి తదితర అతిథులు

**నాంపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** సమాజంలో మన సంస్కృతి, సంప్రదాయాలు కళలను పెంచిపోషించి కాపాడేది ప్రముఖంగా సాంస్కృతిక సంస్థలేనని, వాటికి చేయూత అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో సహా మనందరిపైనా ఉందని ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞుడు, సరస్వతీదేవి ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. ఆర్కా గ్రూప్ సౌజన్యంతో రాగా ఆర్ట్స్ కల్చరల్స్, శ్రీరామ సాంస్కృతిక సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కళాపోషకుడు కెఈ రాజు నేతృత్వంలో రాజువయ్యా మహరాజువయ్యా శీర్షికన బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో వీనులవిందుగా సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దైవజ్ఞశర్మ గౌరవ అతిథులు ప్రముఖ సంగీత దర్శకుడు, గురువు కె.రామాచారి, నేపథ్య గాయని విజయలక్ష్మి, చంద్రశేకర్ గొర్తి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ప్రారంభించి కార్యక్రమాన్ని ప్రసంగించారు. కెఈ.రాజు ఒక గొప్ప గాయకుడుగా సాంస్కృతిక కళారంగానికి చేస్తున్న విశేషసేవలను, తోటి గాయనీగాయకులతో కలిసి జన్మదినాన్ని జరుపుకోవడం అభినందనీయమన్నారు. సినీసంగీత విభావరిలో ప్రముఖ వర్ధమాన గాయకులు బాలకామేశ్వరరావు, వినోద్‌బాబు, వైఎస్. రామకృష్ణ, శశికళాస్వామి, సురేఖామూర్తి, శారదాపవన్, అనురాధ తదితరులు ఆణిముత్యాల్లాంటి గీతాలను సుమధురంగా ఆలపించి తన్మయుల్ని చేశారు.

# ఎన్ఐఆర్‌డిపిఆర్ ఉద్యోగులు నిరసన

**-ఇన్‌స్టిట్యూట్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్**
**-సేవ్ ఎన్ఐఆర్‌డిపిఆర్, సేవ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్లకార్డుల ప్రదర్శన**



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**అత్తాపూర్ ఫిబ్రవరి18, ప్రభాతవార్త :** కేంద్ర బడ్జెట్‌లో ఇన్‌స్టిట్యూట్‌కు నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని పలువురు ఎన్ఐఆర్‌డిపిఆర్ ఉద్యోగస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాజేంద్ర నగర్ ఎన్ఐఆర్‌డిపిఆర్ లో ఉద్యోగులు నిరసన దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్ఐఆర్‌డిపిఆర్ గెట్ ముందు ఉద్యోగులు కూర్చొని తమ సంస్థకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సేవ్ ఎన్ఐ ఆర్‌డిపిఆర్..సేవ్ రూరల్ డెవలమెంట్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు ఉద్యోగస్తులు మాట్లాడుతూ....65 సంవత్సరాలుగా, ఎన్ఐఆర్‌డిపిఆర్ గ్రామీణాభివృద్ధిలో మార్గదర్శక శక్తిగా ఉందని పంచాయతీ రాజ్ సంస్థలు (పిఆర్ఐ), ప్రభుత్వ అధికారులు, ఎన్‌జిఒలు మరియు గ్రామీణాభివృద్ధి నిపుణులకు క్లిష్టమైన శిక్షణ మరియు విధాన మద్దతును అందిస్తోందని అలాంటిది 202526 కేంద్ర బడ్జెట్‌లో ఇన్స్టిట్యూట్ కోసం జీరో బడ్జెట్ కేటాయింపు దాని భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టివేస్తుందని వాపోయారు. దాని శ్రామికశక్తిని మాత్రమే కాకుండా గ్రామీణ సాధికారతకు అవసరమైన వేలాది శిక్షణా కార్యక్రమాలను కూడా ప్రమాదంలో పడేస్తుంది. సేవ్ ఎన్ఐఆర్‌డిపిఆర్, సేవ్ రూరల్ డెవలప్‌మెంట్, డోంట్ అబాండన్ రూరల్ ఇండియా అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య నిర్ణయాన్ని ఖండిస్తున్నామని. చాలా మంది ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతపై తీవ్ర భయాన్ని మరియు ఆవేదనను వ్యక్తం చేశారు, జీతాలు, వైద్య ప్రయోజనాలు మరియు భత్యాలు అన్నీ ప్రమాదంలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్ర బడ్జెట్‌లో ఇన్‌స్టిట్యూట్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డా. జ్యోతిస్ సత్యపాలన్ ప్రొఫెసర్‌ఉపాధ్యక్షుడుడా. సి. ధీరజ అసోసియేట్ ప్రొఫెసర్‌జనరల్ సెక్రటరీడాక్టర్ రాజేష్ కుమార్ సిన్హాఅసిస్టెంట్ ప్రొఫెసర్‌జాయింట్ సెక్రటరీడా. సి. కతిరేసన్‌అసోసియేట్ ప్రొఫెసర్‌కోశాధికారిడాక్టర్ శ్రీనివాస్ సజ్జా అసిస్టాంమ్ ప్రొఫెసర్‌ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డా. చిన్నదురయ్య, అసోసియేట్ ప్రొఫెసర్‌డా. సి. హెచ్. రాధికా రాణి అసోసియేట్ ప్రొఫెసర్‌డా. పార్థ ప్రతిమ్ సాహుఅసోసియేట్ ప్రొఫెసర్‌ప్రత్యూష్న పట్నాల్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాడాక్టర్ అనురాధ పల్లా అసిస్టెంట్ ప్రొఫెసర్‌డాక్టర్ రత్న భుయాన్‌తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ ప్రజలకు అండగా ఉంటా : కూన శ్రీశైలం గౌడ్



కూన శ్రీశైలం గౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న దుండిగల్ గ్రామ ప్రజలు

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద దుండిగల్ గ్రామ ప్రజలు కలిసి వారి సమస్యలను వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్ 453,454 లలో ఆర్టిఓ ఆఫీస్ ఏర్పాటు కోసం కేటాయించిన 40 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు మాకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇపిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసారన్నారు. దుండిగల్ గ్రామ ప్రజలు, రైతులు తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దుండిగల్ గ్రామ ప్రజలు రైతులు అధైర్యపడవద్దు, మీ అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమస్యను మన ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షుడు దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, మాజీ వార్డు సభ్యులు పిట్లా నాగార్జున, చెల్మల్ లక్ష్మణ్, పిట్లా సత్యనారాయణ, నాయకులు ఆకుల ప్రేమకుమార్ పటేల్, దొంతి మహేశ్ ముదిరాజ్, తలారి రాజకుమార్ ముదిరాజ్, కావాలి శశి కుమార్, పండగ శ్రీశైలం ముదిరాజ్, చినంగి మల్లేష్, ఉప్పరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**26 నుండి మార్చి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు**



జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ గోపురానిన నీతితో శుద్ధి చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 26 నుండి మార్చి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 7 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు వెల్లడించారు. ఈనెల 26వ తేదీన ధ్వజారోహణం(మేష లగ్నం) పెద్దశేష వాహనం, 27న చిన్నశేష వాహనం, హంస వాహనం, 28న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం, మార్చి 1వ తేదీన కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 2న పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం) గరుడ వాహనం, 3న హనుమంత వాహనం గజ వాహనం, 4న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 5న రథోత్సవం అశ్వవాహనం, 6న చక్రస్నానం ధ్వజావరోహణం, ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. మార్చి 7న మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం జరుగనుందని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కథలు నిజ జీవితం ప్రతిబింబాలు : బైసా దేవదాస్

**-సాంస్కృతికరంగంలో భీష్మాచార్యులు శిరోమణి వంశీరామరాజు**
**-కస్తూరి అలివేణి రచించిన 'ప్రతిబింబాలు' కథల సంపుటి ఆవిష్కరణ.**



కస్తూరి అలివేణి రచించిన 'ప్రతిబింబాలు' కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు, అత్తలూరి విజయలక్ష్మి తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కథలు నిజ జీవితం ప్రతి బింబాలే నని నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. మంగళవారం రాత్రి వంశీ ఆర్ట్ థియేటర్స్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కస్తూరి అలివేణి రచించిన 'ప్రతిబింబాలు' కథల సంపుటి ఆవిష్కరణ, కళాబ్రహ్మ, శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు–డాక్టర్ తెన్నేటి సుధాదేవిలకు అంకితోత్సవ సభ మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వేదిక అధినేత్రి, ప్రముఖ రచయిత్రి ఆల్తలూరి విజయలక్ష్మి నిర్వహణలో జరిగింది. బైసా దేవదాస్ మాట్లాడుతూ వాస్తవికవున్న కథలు కాల పరీక్షకు నిలబడతాయి అని అలువేణి చెప్పిన కథలు సమాజం లో జరిగే సంఘటనలను అద్దం లో చూపాయి అని ఉదహరించారు. నిజజీవితంలో నుండి వచ్చిన కథలే నిలబడతాయని, నిజజీవితాన్ని భాగా అధ్యయనం చేయగలిగితే కథలను గొప్పగా రాయగలుగుతామని, ఆలోచనాశక్తిని పెంచే విధంగా మనిషిలో మార్పు వచ్చే విధంగా గొప్పగా పనిచేస్తాయన్నారు. అంకితం తీసుకున్న వంశీ దంపతులు సాంస్కృతిక సాహిత్య రంగాలకు రెండు కాళ్ళు అని అభివర్ణించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సాంస్కృతికరంగంలో భీష్మాచార్యులు శిరోమణి వంశీరామరాజు అని అన్నారు. రామరాజు కార్యనిర్వహణలో తెరవెనుక రామరాజు సతీమణి తెన్నేటి సుధాదేవి ఎంతో విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. రచయిత్రిగా, కవయిత్రిగా, తెలుగు అకాడమి డిప్యూటీ డైరెక్టర్‌గా తన స్థానాన్ని గొప్పగా నిర్వహించారన్నారు. అటు సాంస్కృతికరంలో రామరాజు, ఇటు సాహిత్యరంగంలో తెన్నేటి సుధాదేవి ఎంతో గొప్పగా రాణిస్తున్నారని, వారిరువురు పుణ్యదంపతులు అని ముందుతరాలకు అనుసరణీయ మార్గాన్ని నిర్దేశించారన్నారు. కస్తూరి మాటకు సార్థకతను కల్పించింది ఎవరంటే కస్తూరి అలివేణి అని అన్నారు. ఆమె రాసిన రచలన్నీ సరళంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న నేటినిజం పత్రిక ఎడిటర్ బైసా దేవదాస్ మాట్లాడుతూ ఇందుకు మంచి కథలను అందించిన కస్తూలి అలివేణి అభినందనీయురాలన్నారు. రచయిత్రి శైలజామిత్ర, వంశీ మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 'ఝుమ్మంది నాదం' పేరుతో కళాతపస్వీ కె.విశ్వనాథ్ చిత్రాలలోని 'పాటకు పట్టాభిషేకం' పేరుతో గాయనీ గాయకులు వైఎస్.రామకృష్ణ, తుషార నిలయ, సాయి మేఘన తదితరులు పాడిన పాటలు అందరిని అలరించాయి. అంతకుముందు సాయి అర్చన జోస్యుల(కెనడా) నిర్వహించిన స్వాగత నృత్యం అందరిని ఆకట్టుకుంది. లలిత నేమాన నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి వ్యాఖ్యాత్రిగా సుధామయి వ్యవహరించారు. లేఖిని సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి స్వాగతం పలుకుతూ సంస్థల కార్యక్రమాలు పరిచయం చేశారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు -డిసి రవి కుమార్

**అత్తాపూర్ ఫిబ్రవరి18, ప్రభాతవార్త :** పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి శుభ్రత పట్ల నిర్లక్ష్యం వాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాను రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్ పేర్కొన్నారు. పారిశుధ్య మెరుగుదల పై ఎఎంహెచ్ఓ, ఎస్ఎస్, ఎస్ఎఫ్ఎలు రాంకీ బృందంతో డి సి సమీక్షా సమావేశం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత పై పలు సూచనలు చేశారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నిజాంపేట్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మయూరి నగర్ సబ్‌స్టేషన్ 11కేవీ కేటీఆర్ కాలనీ ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు రాఘవ రెడ్డి కాలనీ, నారాయణరెడ్డి కాలనీ, శ్రీనివాస కాలనీ, కేటీఆర్ కాలనీ, బాలాజీ హిల్స్ కాలనీ, ఫేజ్ 2 బ్లాక్ 1,2,3, బాలాజీ అడోబ్ అవెన్యూ, బాలాజీ ఆదర్స్ ప్రాంతాలతో పాటు 11కేవీ మల్లంపేట, ఏసీ టైర్ ఫీడర్‌లలో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శ్రీ హోమ్స్, బ్లాక్ డైమండ్ కాలనీ, కేఆర్‌సీ ఆర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

## రూ. 720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ

**-శరవేగంగా కొనసాగుతున్న పనులు**
**-రైల్ ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు**



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్ ప్రయాణికులకు ప్రత్యేక ద్వారాలు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే 720 కోట్ల వ్యయంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా స్టేషన్ ఆవరణలో సివిల్ పనులు జరుగుతున్నాయి. రైల్వే స్టేషన్ భవనాన్ని ఇటీవల కూల్చివేశారు. నూతన భవనం నిర్మించేందుకు పనులు జరుగుతున్నాయి. రైల్ ప్రయాణికులకు భద్రత కల్పిస్తూ ఎలాంటి ఆ సౌకర్యం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్ ప్రయాణికులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు బయటికి వచ్చేందుకు ద్వారాలలో రాకపోకలకు సమర్థవంతగా నిర్వహిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో రద్దీని క్రమబద్ధీకరించడానికి చర్యలు చేపట్టారు. ఫ్లాట్ ఫారం 1 నుంచి 10 వరకు రైళ్లలో పయాణించే ప్రయాణికుల కోసం, చివరి నిమిషంలో పరుగెత్తకుండా ఆయా ఫ్లాట్ ఫారాలకు సులువుగా వెళ్లడానికి ఫ్లాట్ ఫారాలను ముందుగానే ఎంపిక చేస్తున్నారు. దివ్యాంగులకు ప్రత్యేక కోచ్‌లను ఏర్పాటు చేశారు. మహిళా ప్రయాణికులకు సురక్షితమైన పరిస్థితిని కల్పించడం కోసం సి.ఆర్.పి.ఎఫ్.శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా స్టేషన్‌లో ఎప్పటికప్పుడు అగ్నిమాపక తనిఖీలు చేపడుతున్నారు. ఆర్.పి.ఎఫ్.హెల్ప్‌లైన్‌కు 139 నెంబర్‌కు సంప్రదించాలని రైల్వే అధికారులు సూచించారు.

## మంచినీటిలో ప్రెజర్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు

**-గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



వివరాలు అడిగి తెలుసుకుంటున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో మంచినీటి లోప్రెజర్ సమస్యకు త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని ఆంధ్రకేఫ్ చౌరస్తా సమీపంలోని బి.ఎన్ రెడ్డి వీధి లోని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం బస్తీలో పర్యటించారు. మంచినీటి లోప్రెషర్ సమస్య వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కావున సమస్యను అధిగమించేందుకు నూతన పైప్ లైన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని వాటర్ వర్క్ డిజిఎం కార్తీక్ రెడ్డికి సూచించారు. డివిజన్ లో తీవ్రతరంగా మారిన మంచినీటి లోప్రెషర్ సమస్యను ప్రత్యేక దృష్టి వహించి పరిష్కరించాలని సూచించారు. సేవరేజీ సమస్యపై ఇదివరకే బి.ఎన్ రెడ్డి బస్తి వాసులు చేసిన ఫిర్యాదుకు మేరకు నూతన సేవరేజీ పైప్ లైన్ ఏర్పాటుకు నివేదిక సమర్పించామని, మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్‌వినయ్ కుమార్ వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్స్పెక్టర్ శంకర్, బీజే పీ నేతలు ఆనంద్ రావు, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, పాల్గొన్నారు.

## పాతబస్తీలో టిడిపి పటిష్టతకు నాయకులు కృషి చేయాలి



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బక్క నర్సింహులు టిటిడిపి పోలిటి బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్‌లు కలిసి పాతబస్తీ టిడిపి నాయకులు ఎం.రవీందర్ గౌడ్, మహ్మద్ అహ్మద్ షరీఫ్‌లను అభినందిస్తున్న దృశ్యం

**చార్మినార్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పాతబస్తీలో టిడిపి పటిష్టత కోసం నాయకులు కృషి చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బక్క నర్సింహులు తెలంగాణ తెలుగు దేశం పార్టీ పోలిటి బ్యూరో సభ్యులు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి కోఆర్డినేటర్ నాగు నగేష్, సభ్యులు అన్వర్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో సీనియర్ టిడిపి నాయకులు మహ్మద్ అహ్మద్ షరీఫ్, ఎం.రవీందర్ గౌడ్‌లు బహదూర్‌పుర నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించి నందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బక్క నర్సింహులు టిటిడిపి పోలిటి బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్‌లు కలిసి వారికి శాలువ కప్పి అభినంధించారు. సీనియర్ టిడిపి నాయకులు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ దూద్ బౌలి, మహరాజ్‌గంజ్‌తో పాటు పలు ప్రాంతాలలో 427 మంది టిడిపి సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. సీనియర్ టిడిపి నాయకులు మహ్మద్ అహ్మద్ షరీఫ్, రవీందర్ గౌడ్, ఎం.భార్గవ్ గౌడ్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కరెంటు మీటర్లు ఇవ్వాలని ఏడిఇకి వినతి



వట్టినాగులపల్లి పేద ప్రజలకు కరెంటు మీటర్లు ఇవ్వాలని ఏడిఇకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ఉంటున్న నిరుపేదలకు కరెంటు మీటర్లు ఇవ్వాలని కోరుతూ గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మైలారం ప్రదీప్ కుమార్ ఏడీఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా వట్టినాగులపల్లిలోని గరీబులుండే కాలనీలలో నూతన కరెంటు మీటర్లు ఇవ్వలేదని, దీంతో ఆ పేదలంతా రాత్రి సమయాల్లో, ఎండా కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఉన్న పాలకులు పేదల సమస్యలు పట్టించుకోలేదని, ఇప్పుడు ప్రజాపాలన ప్రారంభమైందని, వెంటనే పేదలుండే బస్తీలలో కొత్త కరెంటు మీటర్లు ఇవ్వాలని అధికారులను కోరామన్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోతే జిల్లా మంత్రిని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్, రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు

**-ప్రిన్సిపాల్ నాగరాణి**

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వచ్చే నెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందు వల్ల విద్యార్థినీలకు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ నాగరాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు అనుభవజ్ఞులైన స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఇంటర్ విద్యా సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని యూనిటెస్ట్ సక్రమంగా రాయకపోవడంతో లెక్చరర్ శంకర్ రెడ్డి గట్టిగా మందలించినందుకు మనస్తాపం చెంది తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో విషయం తెలుసుకున్న మారేడ్‌పల్లి ఎస్ఐ సౌమ్య ఆధ్వర్యంలో ఆమె తల్లిదండ్రులు, లెచ్చరర్ల సమక్షంలో విచారణ జరిపారు. కళాశాలలో పొందు పర్చిన సీసీ కెమారాలను కూడా పరిశీలించారు. ఇందులో ఎవరి పొరపాట్లు లేక పోవడంతో సమస్య సద్దు మనిగింది.

## చెన్నకేశవ దేవస్థానం మెట్ల మార్గం పనులకు పూజ



కార్యక్రమంలో పాల్గొన్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్, దేవస్థానం కమిటి అధ్యక్షులు మహేష్ గౌడ్

**చార్మినార్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని శ్రీ చెన్న కేశవస్వామి దేవస్థానం మార్గం పనులకు మంగళవారం పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్, దేవస్థానం కమిటి చైర్మన్ మహేష్ గౌడ్, దేవస్థానం పాలక వర్గం సభ్యులు శ్రీ ధర్, శైలేష్, రాజు ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, వర్షిత్ గౌడ్ పాల్గొన్నారు.

## సంస్కృతిని ప్రతిబింబింపజేసేవి సంప్రదాయ దుస్తులే



మహిళామణుల కల్చరల్‌వాక్‌లో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** నేటి ఆధునిక సమాజంలో పాశ్చాత్య పోకడలు, దుస్తుల ధారణలకు ఆకర్షితులవుతూ అనాదికాలంగా వస్తున్న అద్భుత భారతీయ సంప్రదాయ దుస్తుల ధారణ, అలంకారాలపట్ల చిన్నచూపు చూస్తున్న నేటి యువతకు స్ఫూర్తి, సదాలోచన కల్పించే విధంగా కల్చరల్ వాక్ పేరిట పలువురు యువతులు సంప్రదాయ దుస్తులను ధరించి సొంపుగా హొయలు ఒలికిస్తూ కళ్లచెదిరేలా ప్రదర్శించిన సంప్రదాయ దుస్తులతో నడక అశేషంగా విచ్చేసిన సభికులను సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తి నయనానందకరం కావించి ఎంతో స్ఫూర్తిమంతంగా నిలిచారు. ముఖ్యంగా జ్యోత్స్న, పాలపాటి, శ్రీలక్ష్మి, ఐశ్వర్యలు తదితర 30మంది మహిళామణులతో నడక ప్రదర్శనలో పాల్గొని ఉత్తేజపరిచారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థలు మానస ఆర్ట్స్, ప్రలాహ్ ఫౌండేషన్, అపర్ణ ఫైన్‌ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో కళాభవన్ వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జి.వెంకట్‌రెడ్డి, ఆమని, రఘుశ్రీ తదితరులు మాట్లాడుతూ కళాలు మన సంస్కృతి, సంప్రదాయ సాహిత్యానికి ప్రతీకలని, మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే సంప్రదాయ పద్ధతులు, దుస్తుల ధారణ ప్రాముఖ్యతను చాటుతూ యువతలో ప్రేరణ కల్గించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయని నిర్వాహక సంస్థల సేవలను కొనియాడుతూ ప్రదర్శనలో పాల్గొన్న మహిళను ఎంతగానో ప్రశంసించారు.

## నేరాల అదుపునకు సిసి కెమేరాలు దోహదం

**-ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**



జనప్రియనగర్‌కాలనీలో సీసీ కెమేరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

నేరాల అదుపులో నిఘానేత్రాలుగా సీసీకెమారాలు దోహదపడతాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని హాఫీజ్‌పేట్ యువనాయకులు నిమమల దాత్రీనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో జనప్రియనగర్ కాలనీ ఫేజ్1,2 అసోసియేషన్ సభ్యుల అభ్యర్థన మేరకు తన సొంత నిధులను వెచ్చించి 32 సీసీ కెమేరాలను అందించారు. సీసీ కెమారాలను పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీతో కలిసి కాలనీసభ్యులు, హాఫీజ్‌పేట్ యువనాయకులు దాత్రీనాథ్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని అన్ని హౌసింగ్ కాలనీ అసోసియేషన్లతో పాటు అన్ని కాలనీలలో సీసీకెమారాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. నేరాలను అదుపుచేసేందుకు సీసీ కెమారాలు ఉపయోగపడతాయన్నారు. దొంగతనాలను నివారించటానికి గాని, నేరస్తులను గుర్తించేందుకు సీసీకెమారాల ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఒక్క సీసీ కెమారా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ ఎస్ఐతో పాటు జనప్రియ నగర్ ఫేజ్ 1 అధ్యక్షులు జయసూర్య, మల్లికార్జున్, సుధాకర్‌దాస్, ఫేజ్ 2 అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జనప్రియ అపార్ట్‌మెంట్స్ పేజ్1 ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

